


ఇంటర్ విద్యార్థులకు సెలక్షన్ డ్రైవ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, హెచ్‌సిఎల్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలోఇంటర్ విద్యార్థులకు టెక్ బీ ప్రోగ్రాంనకు సెలక్షన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి యు.సాయికుమార్, డివిఇఒ మంజుల వీణ తెలిపారు. ఇంటర్ 2021-2022లో 60 శాతం, 2022-2023లో 75శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు ఈ డ్రైవ్‌కు అర్హులన్నారు. ఈనెల 10న ఉదయం 10 గంటల నుంచి స్థానిక శ్రీ వెంకటేశ్వర గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందన్నారు. ఈ డ్రైవ్‌కు హెచ్‌సిఎల్ టెక్నాలజీ ప్రతినిధులు హాజరయ్యి, అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9182398325 ఫోన్ నెంబరును సంప్రదించాలన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అడిగిన వెంటనే పని కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉపాధి హామీలో పని అడిగిన వెంటనే పని కల్పించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పెండింగ్‌లో ఉండకుండా సత్వరమే నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్‌ఒ జె.వెంకటరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో 40 ఆర్జీలు అందాయి. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీటిలో కొన్ని....

*కురుపాం మండలం ఎగువ కొత్తగూడకు బిటి రోడ్డు, ఇంటింటికి మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని కె.చిన్నారావు, పలువురు ఫిర్యాదు చేశారు.

* పార్వతీపురం మండలం పెదమరికిలోని పాత కాలనీకి విద్యుత్, తాగునీరు సదుపాయం కల్పించాలని కె.శ్రీను కోరారు.

* సీతంపేట మండలం గడిగుడ్డి గిరిజన రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ భూములు మీదుగా 33 కెవి, 11కెవి విద్యుత్తు లైన్లు వెళ్తున్నాయని, రెండు లైన్లు ప్రమాదకరమైన ఉన్నాయని, వీటిని రోడ్డుకు ఇరువైపులా మార్చాలని గ్రామ సర్పంచ్ ఎన్.విజయకుమారి, రైతులు వినతి పత్రం సమర్పించారు.

* పార్వతీపురం గ్రామ రెవెన్యూలో ప్రవహిస్తున్న వరహాల గెడ్డలో మున్సిపాలిటీ డ్రైనేజీల ద్వారా చెత్త ప్లాస్టిక్ పేరుకుపోతుందని, వర్షాకాలం సమయంలో ఆ చెత్తంతా వ్యవసాయ భూములపై కలుషిత చెత్తగా పేరుకుపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్య పరిష్కరించాలని కె.వాసు దరఖాస్తు అందజేశారు.

* భామిని మండలం తాలాడలో ఎంపిపి స్కూల్‌లో చేపట్టిన మొదటి విడత నాడు -నేడు పనుల బిల్లులు మంజూరు చేయాలని కొంచాడ చంద్రకళ కోరారు.

* సాలూరు మండలం చీపురువలసకు చెందిన ఓ.చిన్నమ్మ పిటిజి గొర్రెల లోన్ ఇప్పించాలని కోరారు.

* కురుపాం మండలం కోలిశగూడకు చెందిన ఎ.లక్ష్మణ్ రావు ఖాతా నెంబర్ 45-1,45-2,46 తమ భూమికి సర్వే జరిపించి మాభూమి మాకు ఇప్పించగలరని కోరారు.

* సాలూరు మండలం నెల్లిపర్తికి చెందిన ఇప్పిలి లచ్చుమ్మ సర్వే నంబర్ 165-2 కు బదులుగా 162 తప్పుగా నమోదు చేసి ఉన్నారని రీ సర్వే జరిపి తప్పులను సవరించగలరని దరఖాస్తు అందజేశారు.

ఘనంగా మేడే వేడుకలు

పలుచోట్ల జెండా ఆవిష్కరణలు, ప్రదర్శనలు, సభలు

- కార్మిక హక్కులను కాలరాసే బిజెపి విధానాలను వ్యతిరేకించండి
- సిఐటియు నాయకులు రెడ్డి వేణు, వెంకటరమణ

ప్రజాశక్తి - కలెక్టరేట్

కార్పొరేట్, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు తీవ్రంగా అమలవుతున్న నేపథ్యంలో పోరాడి సాధించుకున్న హక్కులపై పాలకవర్గాలు తమ బూర్జువా పెత్తందారీ విధానాలను అవలంభించేందుకు కేంద్రంలో బిజెపి, మోడీ ప్రభుత్వం సర్వశక్తుల ప్రయత్నిస్తున్నాయని, కార్మిక హక్కులను కాలరాసే ఇటువంటి విధానాలను కార్మికులంతా వ్యతిరేకించాలని, ఐక్యంగా మరో విముక్తి పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు రెడ్డి వేణు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. 137 వ మేడే సందర్భంగా జిల్లాలో సిఐటియు ఆధ్వర్యంలో అనుబంధ సంఘాలైన స్కీం వర్కర్లు, మున్సిపల్ వర్కర్స్ అండ్ యూనియన్, రైసు మిల్లు, కళాసీ, ఆటో, తోపుడుబళ్లు, భవననిర్మాణ, ఆర్టీసి కళాసీ, లగేజ్ ఆటో కార్మికులతో పార్వతీపురం పట్టణంలో పలుచోట్ల జెండా ఆవిష్కరణలు, ప్రదర్శనలు, సభలు జరిగాయి. తొలుత స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరణ అనంతరం నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. స్థానిక సుందరయ్య భవనం వద్ద జండా ఆవిష్కరణకు ముందు కార్మికులందరితో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు, వెంకటరమణ మాట్లాడుతూ ప్రపంచ కార్మికులంతా ఐక్యం కావాలని మేడే రోజున కార్మిక వర్గం పిడికిలెత్తి నినందిస్తున్న సందర్భంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వర్గం ఐక్యం కాకుండా చూడ్డానికి మతతత్వాన్ని నూరిపోస్తుందన్నారు. మత సామ్రాజ్యాన్ని భూస్థాపితం చేస్తుందని, మైనార్టీలపై దాడులకు పురికొల్పుతోందని ఇది చాలా దుర్మార్గమైన విధానమని అన్నారు. కార్మికులను విభజించి పాలించడానికి బిజెపి, రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర మతస్తులను వివాహం చేసుకున్న ముస్లింలపై నేరం మోపి అరెస్టులు చేసే చట్టాలను తెచ్చాయని విమర్శించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలకు రక్షణ కరువవుతుందన్నారు. సంఘపరివార్ గుండాలు శాంతిభద్రతలను తమ చేతుల్లోకి తీసుకొని ఏదో ఒక వంకతో మైనార్టీలపై భౌతిక దాడులకు పూనుకుంటున్నాయని సోదర కార్మిక వర్గంపై జరిగే ఈ దారులను ఎదుర్కొనకపోతే కార్మిక వర్గ ఐక్యతకు భంగం కలుగుతుందని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరిస్తుందని, వీటిని అతిచౌకగా అదానీ, అంబానీలకు లీజుపై కట్టబెడుతుండడం ప్రజలకు ద్రోహం చేస్తున్నట్లేనన్నారు. ప్రకృతి వనరులన్నింటినీ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు బదలాయిస్తుందని ఫలితంగా ఆర్థిక అసమానతలు పెరిగి ఆర్థిక మాంధ్యాలకు, సంక్షోభాలకు దారితీస్తుందని హెచ్చరించారు. మోడీ ఆర్థిక విధానం కార్పొరేట్లకు వరాలు ప్రజలకు భారాలుగా ఉందని తెలిపారు. అధిక ధరలతో నిరుద్యోగం, పోషకాహార లోపం ఆకలితో సామాన్యులు అల్లాడుతున్నారని, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం బిజెపి, మోడీ విధానాలను వైసిపి ఎజెండాగా అమలు చేస్తుందని, దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. టిడిపి, జనసేన అధికార పీఠానికై పరితపించడం తప్ప కార్మిక, రైతుల హక్కుల కోసం ప్రశ్నించడం గానీ, నిలదీయడం లేదని, తమ ఎజెండా ప్రజల పక్షానైతే మోడీని నిలదీయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక హక్కులను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, బంటు దాసు, ఐద్వా నాయకులు రెడ్డి శ్రీదేవి, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ వర్కర్స్ అండ్ యూనియన్, రైసు మిల్లు, ఆటో, తోపుడుబళ్లు, భవననిర్మాణ, ఆర్టీసి కళాసీ, లగేజ్ ఆటో, స్కీమ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్.శంకరావు, సిహెచ్ సింహాచలం, ఎం.శ్రీను, జి.కృష్ణ, పి.లక్ష్మణ, భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు



మేడే జెండాను ఆవిష్కరిస్తున్న రెడ్డి వేణు

ఎస్‌పి స్పందనకు 12 దరఖాస్తులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

పార్వతీపురంరూరల్ : పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యం లో జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను స్వయంగా విన్నవించుకున్నారు. ఎస్‌పి వారి సమస్యలు క్షుణంగా విని, ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో 12 ఫిర్యాదులు అందాయని ఎస్‌పి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. స్పందన కార్యక్రమంలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఎన్. శ్రీనివాసరావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ ఎన్‌వి ప్రభాకర్, డిసిఆర్‌బి, ఎస్ఐ పి. దినకర్ సిబ్బంది పాల్గొన్నారు.



నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

నాటు... నాటు

- గ్రామాల్లో విచ్చలవిడిగా సారా తయారీ, అమ్మకాలు
- తూతూ మంత్రంగా ఎస్ఇబి దాడులు
- ప్రభుత్వాదాయానికి గండి

ప్రజాశక్తి - కురుపాం

గ్రామాల్లో నాటు సారా ఏరులై పారుతోంది. అడ్డూ అదుపు లేక ఎక్కడ పడితే అక్కడ నాటు విరివిగా లభిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. మండలంలోని కాకితాడ, ఉదయపురం, జీలుమానుగూడ, బొడ్డుగాడిగూడ, ఒబ్బంగి, ఊసకొండ, పాతకురుపాం, గుమ్మగదవలస, మర్రిగూడ, అంటిజోల, డంబ్రుగూడ, దండుసూరగూడ తదితర గ్రామాల్లో భారీగా నాటు సారా తయారీ, క్రయ విక్రయాలు నిత్యం జరుగుతున్నాయి. దీన్ని అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుంది. మద్యం దుకాణాలు ప్రభుత్వ ఆధీనంలో నడుస్తుండగా, గతంలో ప్రైవేటు వ్యాపారులు వేలం ద్వారా దుకాణాలను దక్కించుకొని వ్యాపారం నిర్వహించేవారు. ఆ సమయంలో గ్రామాల్లో నాటు సారా ఎక్కువగా ఉండడంతో తమ ఆదాయానికి గండి పడుతుందనే కారణంతో ప్రైవేట్ వైన్ దుకాణాలు ఎక్సైజ్ అధికారులతో నిరంతరం దాడులు నిర్వహించేవారు. దీంతో చాలావరకు నాటుసారా నియంత్రించబడింది. అయితే ప్రస్తుతం ప్రభుత్వ ఆదాయాన్ని గండిపడుతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నారు. గతంలో నిరంతరం నాటుసారా కేసులు నమోదు అవుతుండేవి. ఇటీవల కాలంలో కేసులు చాలా తక్కువ నమోదు కావడం విశేషం. దీంతో ఎటువంటి భయం లేకుండా నాటుసారా తయారీదారులు బహిరంగంగా సారా విక్రయిస్తున్నారు.

కుటీర పరిశ్రమగా సారా తయారీ

ఏజెన్సీలో సారా తయారీ కుటీర పరిశ్రమగా సాగుతోంది. గిరిజన గ్రామాల్లో ఎక్కడికక్కడ భారీగా సారా తయారు చేస్తూ, అమ్మకాలు సాగిస్తున్నారు. లాక్డౌన్ కాలంలో పనుల్లేక ఖాళీగా ఉన్నవారిలో ఎక్కువ మంది సారా అమ్మకాలపై దృష్టి సారించారు. మరికొంతమంది ఒడిశా నుంచి దిగుమతి చేసుకుని, విక్రయాలు సాగించేవారు. ఇతరత్రా వ్యాపారాలు సాగకపోవడం ఒక కారణమైతే, ప్రభుత్వం మద్యం ధరలు అధికంగా పెంచడం మరో కారణం. ఒకవైపు ఆదాయం కోల్పోయి, మరోవైపు అధిక ధరలకు మద్యం కొనుగోలు చేయలేక మందుబాబులు నాటు సారా వైపు మొగ్గు చూపారు. ఎక్కువమంది సారాపై ఆధారపడటం చూస్తున్న పలువురు లాభాలు కురిపిస్తున్న సారా అమ్మకాలపై దృష్టిసారించారు.

గత మూడేళ్లలో పట్టుబడ్డ కేసులు

ఇదిలా ఉండగా గత మూడేళ్లలో ఎస్ఇబి అధికారులు జరిగిన దాడుల్లో పట్టుపడిన ముద్దాయిలు, నమోదు చేసిన కేసుల వివరాలిలా ఉన్నాయి. 2020లో 82 కేసులు నమోదు చేసి 30 మంది ముద్దాయిలు కాగా, 2021లో 111 కేసులకు గానూ, 15 మంది ముద్దాయిలు, 2022లో 127 కేసులకు గానూ 86 మంది ముద్దాయిలు, ప్రస్తుత సంవత్సరానికి ఇప్పటి వరకు 20 కేసులు నమోదు కాగా, 21 మంది ముద్దాయిలు ఉన్నారు. ఈ మూడేళ్లలో సుమారు లక్షా04, 840 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. 7108 లీటర్ల నాటు సారా, 31 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, 59 ఆంధ్రా మద్యం, 50 ఒడిశా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం :

నేను ఫిబ్రవరి నెల 7న విధుల్లోకి చేరిన నుంచి నేటి వరకు 34 మంది వ్యక్తులపై 30 ఎస్ఇబి నేరాలపై కేసులు నమోదు చేసి 4950 లీటర్ల నాటు సారా తయారీకి సిద్ధంగా పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశాను. 412 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని 20 లిక్కర్ బాటిల్లను, 80 చిన్న లిక్కర్ బాటిళ్లను, ఎన్‌డిపిఎల్ మద్యాన్ని స్వాధీన పరుచుకున్నాం. నాటు సారా ఎక్కువగా తయారీ, అమ్మకాలు చేసే గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు పెట్టి రానున్న రోజుల్లో గ్రామాల్లో నాటు సారా నివారణకు కృషి చేస్తాం. అలాగే సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉంది.

బి. నాగభూషణరావు
ఎస్ ఈ బి ఎస్ ఐ కురుపాం

అరికట్టలేని అధికారులు

అక్రమ మద్యం, సారా అమ్మకాల ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. మరోవైపు దీనివల్ల అనారోగ్యాలపాలై గిరిజన కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. గిరిజనులు ఆరోగ్యాలు పాడుచేసుకుంటున్నారు. అయినా మద్యం అమ్మకాలను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పక తప్పదు. మండలంలో కొన్ని గిరిజన గ్రామాల్లో సర్కారు మద్యం అంటే తెలియని పరిస్థితి ఉంది. సారా విచ్చలవిడిగా అమ్మకాలు చేపట్టడం వల్ల ప్రభుత్వ మద్యం వైపు వెళ్లడం లేదు. గిరిజన ప్రాంతాల్లో రోజుకు సుమారు 2వేల లీటర్ల సారా తయారు చేస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో ఎస్ఇబి బృందాలు పలుమార్లు సారా తయారీ కేంద్రాలపై దాడులు చేపట్టారు. బెల్లం ఊట మాత్రమే ధ్వంసం చేశారు తప్ప నిర్వాహకులకు పట్టుకోలేని పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా చేసుకొని సారా తయారీదారుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అక్రమ మద్యం, సారా అమ్మకాలపై దృష్టిసారించి, అరికట్టాలని గిరిజనులు కోరుతున్నారు.



పగుల చెన్నూరులో గిరిజనులతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఒడిశా సంయమనం పాటించాలి

కొటియా గ్రామాల్లో డిప్యూటీ సిఎం పర్యటన

ప్రజాశక్తి - సాలూరు

సరిహద్దు గ్రామాల వివాదం పరిష్కారమయ్యేంత వరకు ఒడిశా అధికారులు, ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టు చెన్నూరు, పగుల చెన్నూరు పంచాయతీల పరిధిలో గల గ్రామాల్లో పర్యటించారు. అనంతరం ఆయన ఒడిశా విలేకరులతో మాట్లాడుతూ ఒడిశాతో శత్రుత్వం కోరుకోవడం లేదన్నారు. స్నేహపూర్వకంగా సరిహద్దు గ్రామాల వివాదంతో పాటు ఇతర కీలక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆంధ్రా సిఎం జగన్ మోహన్ రెడ్డి ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్‌తో చర్చలు జరిపారని తెలిపారు. ఇంతవరకు రెండు రాష్ట్రాల సంక్షేమం, అభివృద్ధి, పథకాలను కొటియా గ్రామాల గిరిజనులు అనుభవిస్తున్నారని చెప్పారు. ఎపి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఈ గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఆ పథకాలు గిరిశిఖర గ్రామాల్లో ఏ మేరకు లబ్ది చేకూర్చుతున్నాయో తెలుసుకుని అందని వారికి అందేలా చూస్తామని చెప్పారు. ఈ గ్రామాల్లో కొంతమందికి ఒడిశా ఆధార్ కార్డులు ఉండడంతో ఆంధ్రా సంక్షేమ పథకాలు మంజూరు కావడం లేదన్నారు. దీని వల్ల నిజమైన నిరుపేద గిరిజనులు నష్టపోతున్నారని చెప్పారు. ఆంధ్రా ఆధార్ కార్డులు ఉంటే సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి, ఎఎంసి చైర్ పర్సన్ దండి అనంతకుమారి, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, భరత్ శ్రీనివాస్, గిరిజన సర్పంచులు మువ్వల ఆదియ్య, పి.సుదర్శనరావు, గిరిజన నాయకులు కొండపల్లి సింహాచలం, సింగారమ్మ పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని ఎమ్మార్ నగరం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ రేటరీని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం ప్రారంభించారు. అనంతరం కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన విద్యార్థులకు పత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విలియం కేరి, స్థానిక సర్పంచ్ వంగపండు లక్ష్మి, ఉపసర్పంచ్ త్రినాధ నాయుడు, ఎంపిపి మధ్య శోభారాణి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని టిడిపి ధర్నా

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి, సోమవారం పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం పిఒకు వినతి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వారం రోజులకొకసారి నీరు ఇస్తున్నారని, కొన్ని ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతుందని ఆరోపించారు. కౌన్సిల్ సమావేశాల్లో టిడిపి సభ్యులు సమస్యను ప్రస్తావించినా స్పందన లేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు జి రవికుమార్, దొగ్గ మోహనరావు, కౌన్సిలర్లు బడే గౌరీ నాయుడు, కోల సరితా, మధుసూదన్, తాతపూడి వెంకటరావు, నాయకులు గర్భాపు ఉదయభాను తదితరులు ఉన్నారు.

అధికారులు స్పందనకు రావాల్సిందే


ప్రజాశక్తి- సీతంపేట

ఐటిడిఎ స్పందనకు డివిజన్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటిడిఎలో ఆమె ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పందనలో వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. గత వారంలో వచ్చిన వినతులపై రివ్యూ నిర్వహించారు. ఈ స్పందనకు 24 వినతులు వచ్చాయి. వడ్డంగి గ్రామానికి చెందిన మృదుల ఇల్లు నిర్మించుకోవడానికి తనకు స్థలం మంజూరు చేయాలని కోరారు. కడగండికి చెందిన జాన్ బోర్వెల్ మంజూరు చేయాలని కోరారు. జూయి మానుగూడకు చెందిన తమ్మారావ్ గ్రావెల్ రోడ్డు మంజూరు చేయాలని, పెద్దూరుకు చెందిన మాణిక్యం కొత్త జాబ్ కార్డు మంజూరు చేయాలని, పెద్దగూడకు చెందిన బాపయ్య అంగన్వాడి భవనం మంజూరు చేయాలని, దేవనాపురానికి చెందిన నిమ్మక కాంతారావు షాపు అద్దెకు ఇవ్వాలని కోరారు. ఈ స్పందన కార్యక్రమంలో జిసిసి డిఎం సంధ్యారాణి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కె విజయ పార్వతి, డిఇ కృష్ణ కుమార్, పిఎఒ హరికృష్ణ, సిడిపిఒ పి రంగలక్ష్మి, ఎడిఇ తిరుమలరెడ్డి, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పింఛనుదారులు ఇకెవైసి చేసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పింఛనుదారులు పింఛను సిఎఫ్ఎంఎస్ ఐడితో ఆధార్ నంబర్‌ను ఇకెవైసి అనుసంధానం చేయాలని జిల్లా ఖజానా అధికారి ఆరిక మన్మథరావు కోరారు. జిల్లాలోని నాలుగు ఉప ఖజానా కార్యాలయాల ద్వారా పింఛను పొందుతున్న పింఛనుదారులంతా ఇకెవైసి చేయాలని సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ 35 శాతం మంది మాత్రమే నమోదు చేసుకున్నారన్నారు. సిఎఫ్ఎంఎస్ ప్రభుత్వ సేవలు వినియోగించుకొనుటకు, పింఛను పొందుటకు ఎటువంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురు కాకుండా వెంటనే హెర్బ్ యాప్ (herb app) https://play.google.com/store/apps/details? id=in.apcfss.in.herb.emp ద్వారా లేదా పింఛను పొందుతున్న ఉప ఖజానా కార్యాలయానికి వెళ్లి ఈనెల 6 లోగా ఇకెవైసి చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇకెవైసి చేయుటకు ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానం చేసిన ఫోన్, సిఎఫ్ఎంఎస్ ఐడి , పిపిఒ కాపీ, బ్యాంక్ పాస్ బుక్ తీసుకు వెళ్లాలని ఆయన సూచించారు. జిల్లాలోని ఉప ఖజానా అదికారులంతా పింఛనుదారుల ఇకెవైసి పూర్తి చేయడంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఉప ఖజానా కార్యాలయాల పరిధిలో ఈ నెల 3,4,5 తేదీల్లో ఆధార్ ఇ కెవైసికి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఖజానా అధికారి కోరారు.



సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న సంజీవరావు, గ్రామపెద్దలు

ఘనంగా సుందరయ్య జయంతి వేడుకలు

ప్రజాశక్తి - బలిజిపేట

కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య జయంతి మండలంలోని పెదపెంకిలోని నేతాజీ గ్రంధాలయం స్థాపకులు ఈర్ల సంజీవనాయుడు, గ్రామ పెద్దలు సమక్షంలో సోమవారం నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయన జీవితం పేద, బడుగు, బలహీవర్గాలకు అంకితం చేశారన్నారు. తన జీవితంతో పాటు ఆస్తిని కూడా సమర్పించి, జైలు జీవితాన్ని అనుభవించారన్నారు. కార్యక్రమంలో డి.జగన్నాధం, దత్తి సత్యనారాయణ, జగది సంఘం, మధు, గుళ్లిపల్లి వెంకటప్పలనాయుడు, అప్పాలాచారి పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

పాచిపెంట: మండలంలోని 7 అంగన్వాడి హెల్పర్స్ మూడు మినీ అంగన్వాడి పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఒ బి.అనంతలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు సంబంధించి ఈ నెల ఎనిమిదో తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మోదుగ, మూటకూడు, విశ్వనాథపురం, మిలియ కంచూరు, చిన్న చీపురు వలస, కుంతాం, చెరుకుపల్లి, హెల్పర్స్ ఒలిసిలమడ, లోవ వలస, రావివలస, మినీ అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

వాడవాడలా మేడే వేడుకలు


పాలకొండ: ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న రమణారావు

కార్మికుల దీక్షా దినమైన మేడే వేడుకలు జిల్లాలో వాడవాడలా ఎర్రజెండా రెపరెపలాడింది. స్కీం వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, తోపుడుబండ్ల కార్మికులు, కళాసీలు తదితరులు ప్రధాన కూడళ్లలో మే డే జెండాను ఎగుర వేశారు. పలుచోట్ల ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మే డే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు, పాత బస్టాండ్ వద్ద ఆర్‌టిసి కళాసీలు, లోకల్ ఆటోస్టాండ్ యూనియన్ కార్మికులు, జియ్యమ్మవలస, కురుపాం, గరుగుబిల్లి ఆటో స్టాండ్ యూనియన్ కార్మికులు, అలమండ ఆటోస్టాండ్ యూనియన్ కార్మికులు, తోపుడుబండ్ల వర్తకులు, రైస్ మిల్లర్ కళాసీలు, పట్టణ పోలీస్ స్టేషన్ చివర, కొత్తవలస విజయరామరాజు కాలనీ వద్ద ఉన్న భవన నిర్మాణ కార్మికులు, ఆయా ప్రాంతాల్లో సిఐటియు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో కలిసి ప్రధాన రహదారి గుండా నాలుగు రోడ్ల కూడలి వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కోశాధికారి గొర్లి వెంకట రమణ, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో కార్మిక హక్కులను సాధించుకున్నామని, మతోన్మాద బిజెపిని గద్దె దించి కార్మిక చట్టాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు సంఘాల కార్మికులు, సంఘం నాయకులు, కార్యకర్తలు, సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మేడే సందర్భంగా సీతంపేటలో సిఐటియు మండల కమిటి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరిగింది. తొలుత సిఐటియు కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సురేష్, ఎం.కాంతారావు మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సభ్యులు ఉషారాణి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి.ఎ.దర్శిమి, పి.అంజలి, ఎ.పార్వతి, ఎన్.ప్రియ, ఆశావర్కర్ల ఎస్.మాలతి, ఎస్.రాజేశ్వరి, ఎస్.చిన్నమి, మధ్యాహ్న భోజన కార్మికులు ఎన్.రాయిబారి, కె.ఉషా, గిరిజన సంఘం నాయకులు బి.అప్పారావు, పి.సాంబయ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాలూరు: మేడే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యాన పట్టణంలోని పలు ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణ జరిగాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సీనియర్ కార్మికుడు టి.పోలిరాజు, దండిగాం రోడ్డులో ఉన్న మినీ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద నాయకులు శివాజీ,

న్యాయసేవా కమిటీ ఆధ్వర్యాన...

పార్వతీపురంరూరల్ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా, సోమవారం స్థానిక వాసవీ కల్యాణ మండపం, పాత బస్టాండ్లలో మండల న్యాయ సేవా కమిటీ, జిల్లా కార్మిక శాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెండవ అదనపుజిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు, సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞనారాయణ, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కె.రామకృష్ణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, సీనియర్ న్యాయవాది టి.జోగారావు, వివిధ సంఘాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో పట్టణ కమిటీ నాయకులు టి.వెంకటరావు, శివాలయం వీధిలో భవననిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు యర్రా జగన్నాధం జెండా ఆవిష్కరణ చేశారు. అర్బన్ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద కూడా జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభల్లో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే ప్రభుత్వాలు, యాజమాన్యాలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో నీలకంఠాపురం పంచాయతీ కేంద్రంలో మండంగి అడ్డమేశ్వరరావు ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా నాయకులు కోలక అవినాష్ జెండాను ఆవిష్కరించారు. కురుపాం మండల కేంద్రంలో రావాడ జంక్షన్ వద్ద సిఐటియు మండల నాయకులు ఎం.శ్రీనివాసరావు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, ఆశా వర్కర్లు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులు జెండాను సిఐటియు మండల నాయకులు ఎన్.ప్రసాదరావు, పి.ప్రసాదరావు జెండాను ఎగరవేశారు. ఎఐసిటియు మండల నాయకులు నర్సిపురం ఈశ్వర్రావ్, సిపిఐ మండల నాయకులు బి.మోహనరావు, నడుకూరులోనే భవన నిర్మాణ కార్మికుల మండల కన్వీనర్ బి.వాసుదేవరావు జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు, కె.శ్రీనివాసరావు, మణికంఠ తదితర కార్మికులు పాల్గొన్నారు.

కొమరాడ: మండల కేంద్రంలో మేడే జెండాను సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ఎగురవేశారు. తొలుత మెయిన్ రోడ్డు మీద ర్యాలీ నిర్వహించారు. సీసాడవలసలో గిరిజన సంఘం నాయకులు సంగమ్మ, సోములు, అంటివలసలో రామస్వామి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గొర్లి జయమ్మ, రాజేశ్వరి దుర్గ, బొంగు చిన్నం నాయుడు, యమక గౌరు నాయుడు, సాగర్, రెడ్డి శివున్నాయుడు, గౌరమ్మ, లక్ష్మణరావు, పిఅప్పలనాయుడు, వెంకటి, మన్మధరావు, లక్ష్మీనాయుడు, పారినాయుడు, లలిత, మంగమ్మ, సునీత, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ఎపి గిరిజన సంఘం కార్యాలయ ఆవరణలో మేడే జెండాను సిఐటియు మండల కార్యదర్శి


బలిజిపేట: జెండా ఆవిష్కరణ చేస్తున్న వంజరాపు సత్యంనాయుడు

కె.గౌరీశ్వరరావు ఆవిష్కరించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోలక అవినాష్, నాయకులు పువ్వుల మోహనరావు, సన్యాసిరావు, ఆడిత్, పాండురంగారావు, అంగన్వాడీ ఉద్యోగుల సంఘం నాయకులు కస్తూరి, సత్యవతి తదితరులు ఉన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు జెండాను మండల కార్యదర్శి జి.వెంకటరమణ ఎగరవేశారు. కాశీపేట రైస్ మిల్లు ఎదుట సిఐటియు జెండాన ఎగరవేశారు. ప్రజాసంఘాల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, రాము, ఆర్.రాము, శంకర్రావు, ఎస్.కృష్ణ, టి.రమేష్, జి.జ్యోతి, టి.జయలక్ష్మి, బి.అప్పారావు, ఆర్.లక్ష్మునాయుడు, సిహెచ్.కృష్ణ, వై.రామారావు, విశాంత్ కుమారి, గౌరితో పాటు సంఘ నాయకులు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో సిఐటియు నాయకులు శ్రామిక మహిళా టి.ప్రభావతి, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సిఐటియు మండల నాయకులు చింత పోలిరాజు, జూనియర్ కాలేజీ ఆవరణలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మేడే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రామిక మహిళలు, భవన నిర్మాణ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : పట్టణ, మండల కేంద్రాల్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ఎర్రజెండా ఆవిష్కరించారు. అనంతరం మండల కమిటీ అధ్యక్షులు బి.అమరవేణి అధ్యక్షతన జరిగిన మేడే సభలో రమణారావు మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. జెవివి జిల్లా కార్యదర్శి ఎస్.మహేష్, యుటిఎఫ్ నాయకులు కాంతారావు తదితరులు మాట్లాడారు. తొలుత స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదగా భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే తంపటపల్లిలో ఆర్.వెంకటరమణ అధ్యక్షతన టి.శ్రీరాములు, గొట్టమంగళాపురంలో మజ్జి వీరంనాయుడు అధ్యక్షతన బబ్బది శివ, రైస్ మిల్ సెంటర్లో ఎడ్ల శ్రీను అధ్యక్షతన గేదెలు సత్యం, సిఐటియు మండల కార్యదర్శి కాద రాము అధ్యక్షతన ఆటో స్టాండ్ దగ్గర జెండా ఆవిష్కరణ జరిగింది. ఔట్ గేట్ దగ్గరలో బి.మాధవ, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా పి.భాస్కరరావు, ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా బి. అమరవేణి, ఎన్.కె.రాజుపురంలో ఎ.లక్ష్మణరావు జెండా ఆవిష్కరించారు. సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో పలు కార్మిక సంఘాలు నాయకులు కె .గౌరీశ్వరి, జెస్సీ బాయి, ఎ.పద్మావతి, రాధా రాణి, శాంతి కుమారి, ఎస్. మనీ , ఎం. శ్యామల, చింతల సంజీవి, పడాల వేణు, ఎస్. నారాయణరావు, ఎం.రమేష్ తదితరులు ర్యాలీకి నాయకత్వం వహించారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన,మున్సిపల్,ఆటో భవనం,రైస్ మిల్ ,గ్రీన్ అంబాసిడర్ కార్మికులు, తదితర రంగాల కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. డప్పు కళాకారులు కూడా ర్యాలీలో భాగస్వాములయ్యారు.

సాలూరు రూరల్ : మండలంలోని మామిడిపల్లి, బాగువలసలో సిఐటియు, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ఎన్వై నాయుడు, మర్రి శ్రీనివాసరావు సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు జ్యోతిష్య రావు, మహేష్, అప్పలరాజు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కుమారి, జానకి, సిహెచ్‌డబ్ల్యు రాజేశ్వరి పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని బంటువాని వలస, అడ్డాపుశీల, కూడళ్లలోని ఎఫ్‌సిఐ గోడౌన్ల కళాశీల సంఘం ఆధ్వర్యంలో నిర్వాసిత సంఘం అధ్యక్షులు బంటు దాసు

ఎల్ఐసి కార్యాలయం వద్ద

కలెక్టరేట్ : స్థానిక ఎల్ఐసి బ్రాంచ్ ఆఫీస్ నందు ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పతాకం ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఎల్ఐసి ఎంప్లాయిస్ బేస్ యూనిట్ కార్యదర్శి ధర్మారావు, అధ్యక్షులు ఆర్‌వి ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఎంప్లాయిస్ బేస్ యూనిట్ సభ్యులు శ్రీనివాసరావు, శాస్త్రి, భగవాన్, బ్రాంచ్ ఆఫీస్ సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.


సాలూరు : మాట్లాడుతున్న ఎన్వై నాయుడు

సిఐటియు జెండాను ఎగురవేశారు. అనంతరం కార్మికులనుద్దేశించి మాట్లాడారు.

భామిని : మండల కేంద్రంలో సిఐటియు జెండాను భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు రామారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.తిరుపతిరావు మాట్లాడారు. అనంతరం అంబేద్కర్ కూడలి నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు మంతెన అప్పలస్వామి, ఉపాధ్యక్షులు భీమసింగి రామారావు, సహాయ కార్యదర్శి డి.సుబ్బారావు, కార్యదర్శి రీసు గణపతి, కమిటీ సభ్యులు బి.కాంతారావు, దాసరి మహేష్, సిపిఎం మండల అధ్యక్షులు జగన్నాయకులు, జి.మిన్నారావు, అబ్బులమ్మ, పద్మ, వివిధ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సిఐటియు సీనియర్ నాయకులు వంజరాపు సత్యంనాయుడు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం వర్షంలో తడుస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం ప్రాణాలు త్యాగం చేసిన ఈ రోజు దీక్షా దినం అన్నారు. మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్య పోరాటాలు నిర్వహించి హక్కులను, చట్టాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ, రైస్‌మిల్, భవన నిర్మాణ కార్మికసంఘాలు, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

జియమ్మ వలస : మండల కేంద్రంలో మేడే జెండాను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన...

మక్కువ : రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరణలు మూలవలస, దుగ్గేరు, పెద్దఊటగెడ్డలో ఆయా గ్రామాల పెద్దలు పీడిక అప్పారావు, కొర్ర గంగులు, బలియార్ సింగ్ తౌడు ఆవిష్కరించారు. మక్కువలో వివిధ సంఘాల ఆధ్వర్యాన మేడే వేడుకలు జరిగాయి.

సిపిఐ కార్యాలయంలో...

పార్వతీపురంటౌన్ : సిపిఐ కార్యాలయం వద్ద ఎఐటియుసి పతాకాన్ని నాయకులు టి.జీవ ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు బిటి నాయుడు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


కురుపాం: జెండాను ఆవిష్కరిస్తున్న కోలక అవినాష్


పాచిపెంట: జెండాను ఆవిష్కరిస్తున్న ఈశ్వరరావు


సీతంపేట: ర్యాలీ చేస్తున్న సిఐటియు, సిపిఎం నాయకులు


సీతానగరం: ర్యాలీ చేస్తున్న సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు


బామిని: జెండాను ఆవిష్కరిస్తున్న రామారావు

గిరిజనులకు మౌలిక సదుపాయాలు

కలెక్టరేట్ : గిరిజన ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందనలో ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రధానంగా రహదారుల నిర్మాణం, తాగునీరు, విద్యుత్, స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు కొండగొర్రి చిన్నారావు, పల్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సాలూరు, కురుపాం, పార్వతీపురం మండలాల గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

మండలంలో టిటిడి ప్రచార రథం

పాలకొండ : టిటిడి ప్రచార రథం మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పర్యటించింది. సీతంపేటలో కొత్తగా నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయం అందరికీ తెలిసేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు టిటిడి విశాఖపట్నం జిల్లా ప్రచార సమన్వయకర్త ఎస్‌కెసిఎం శర్మ తెలిపారు. తుడ్డలి, కె. కె.రాజుపురం, పి.ఎల్.దేవిపేట, రాజుపేట, పెద్ద పేట, రామన్న పేట కూడలి, పాలవలస ప్రాంతాల్లో ప్రచార రథం సందర్శించిందని అన్నారు. కార్యక్రమంలో పలు భజన బృందాలు పాల్గొన్నాయన్నారు.

రోగులకు నాణ్యమైన భోజనం అందిస్తాం

సీతంపేట: స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఉన్న రోగులకు నాణ్యమైన భోజనం అందిస్తామని ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ బి శ్రీనివాసరావు అన్నారు. సీతంపేట ఏరియా ఆసుపత్రిలో విజయవాడకు చెందిన భోజనం టెండర్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మే నెల ఒకటో తేదీ నుండి రోగులకు భోజనం అందించడం ప్రారంభమైంది దీనిని సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన భోజనం తప్పనిసరిగా అందిస్తామని దానితోపాటు మెరుగైన వైద్యం సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఈయనతో పాటు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

భామిని : మండలంలో ప్రతీ పంచాయతీని స్థానిక సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారదులు సమన్వయంతో అభివృద్ధి చేసుకోవాలని వైసిపి నాయకులు తోట సింహాచలం తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ నిర్వహణ పట్ల స్థానిక ప్రతినిధులతో ఆయన సోమవారం మాట్లాడారు. ఈ సందర్భంగా పంచాయతీలో మౌలిక వసతులును అభివృద్ధి చేసుకుంటూ, ప్రాధాన్యత క్రమంలో పంచాయతీలో వివిధ పనులు స్థానిక ప్రజా ప్రతినిధులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- డెంకాడ

ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు సోమవారం నుంచి డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. సుమారు రెండు వారాలు పాటు జరిగే ఈ తరగతులను ఫెయిలైన విద్యార్థులు వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఎం. ఆదినారాయణ రావు కోరారు. సప్లీమెంటరీ పరీక్షలకు ఈ నెల 3లోగా ఫీజు చెల్లించాలన్నారు.

సిఎం సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- డెంకాడ

ఈ నెల మూడున భోగాపురం విమానాశ్రయం శంకుస్థాపన తరువాత సవరవిల్లి వద్ద ఏర్పాటు చేయనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు ఎంపిటిసిలు, వైసిపి నాయకులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల్లిమర్ల నియోజవర్గం నుంచి సుమారుగా 45 వేల మందిని బహిరంగ సభకు తరలిస్తున్నామని చెప్పారు. వీరి కోసం 450 బస్సులు 2వేల ఆటోలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డెంకాడ మండలం నుంచి 94 బస్సులు 380 ఆటోలు బహిరంగ సభకు ప్రజలు తరలించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి మండల నుంచి పదివేలు మందికి తగ్గకుండా ప్రజల హాజరుకావాలని దానికి అనుగుణంగా సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సర్పంచ్ ఆగ్రహం

ప్రజాశక్తి - మక్కువ

తన పంచాయతీలోని జరుగుతున్న పలు కార్యక్రమాలపై మాటైనా చెప్పకుండా వారికి నచ్చిన రీతిలో పనులు చేసేస్తున్నారని ఎస్ పెద్దవలస సర్పంచ్ పూడి రమణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ఉద్యానవన శాఖ అధికారి, మండల వ్యవసాయ శాఖ అధికారి పంచాయతీలో రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసినా తనకు చెప్పలేదన్నారు. ఉద్యానవన శాఖ గ్రామ అధికారి పంట నష్టపరిహారాలకు సంబంధించి కొంతమంది వ్యక్తులతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. సిహెచ్‌సిలకు అందజేసే వ్యవసాయ యాంత్రీకరణ యంత్రాలు ఏ విధమైన సర్పంచ్ తీర్మానాలు లేకుండానే లబ్ధిదారుల ఎంపిక వారే చేసుకుని సబ్సిడీలు అందేలా చూస్తున్నారని ఆమె ఆరోపించారు. గతంలో పంట నష్ట పరిహారాలు అందజేసేటప్పుడు చేతివాటం ప్రదర్శించిన మాదిరిగానే ఈసారి కూడా ముందస్తు ఒప్పందాలతో ఇంటర్నెట్ జాబితా తయారు చేశారని ఉద్యాన శాఖ గ్రామ అధికారిపై ఆమె ఆరోపించారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ అధికారులు తీరుపై విచారణ చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.


సర్పంచ్ రమణమ్మ

ఫిర్యాదులు ఉంటే తగు చర్యలు తీసుకుంటాం

ఎస్ పెద్దవలస గ్రామ ఉద్యానవన శాఖ అధికారి స్థానిక సర్పంచ్ చేసిన ఆరోపణలపై ఉద్యానవన శాఖ అధికారిని ప్రత్యూష భానును వివరణ కోరగా తన దృష్టికి ఇంతవరకు ఏ విధమైన ఫిర్యాదులు అందలేదని, ఫిర్యాదులు అందిన వెంటనే విచారణ చేపట్టి చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె విలేకరులకు తెలిపారు

ఎంపిక పారదర్శకంగా చేశాం

ఎస్‌పెద్దవలసలో సిఎస్‌సిలకు అందజేసే వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ యంత్రాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగానే చేశామని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. సిహెచ్‌సి చైర్మన్ మరణించిన తర్వాత కమిటీ ఆమోదం మేరకు యంత్రాలు పనిముట్లుకు సంబంధించి రైతులను ఎంపిక చేయడం జరిగిందన్నారు ఏ విధమైన అవినీతికి తావు లేదని ఆయన తెలిపారు.

రెవెన్యూ గ్రామాలుగా మార్చాలని వినతి

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బొడ్డగూడ పంచాయతీ కోటకొండ గ్రామానికి చెందిన గిరిజనలు తమ గ్రామం కోట కొండ అటవీ గ్రామం నుండి రెవెన్యూ గ్రామంగా మార్చాలని కోరుతూ భామిని తహశీల్దార్ ఎన్. అప్పారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ గ్రామంలో 26 గృహాలు ఉన్నాయని, గతంలో ప్రభుత్వం బావి, రోడ్, కొంతమందికి గృహాలు కూడా మంజూరు చేయడంతో నిర్మాణాలు జరిగాయని, గ్రామంలో మినీ అంగన్వాడీ కేంద్రం కూడా ఉందని ఉన్న గృహాలకు విద్యుత్తు బిల్లులు చెల్లిస్తున్నామని, ఇటీవల కొత్తగా ఇల్లు మంజూరై కడితే గ్రామం అటవీ పరిధిలో వుందని, అక్కడ నిర్మించ కూడదని చెబుతున్నారని, పై అంశాలు పరిశీలించి తమ గ్రామాన్ని రెవెన్యూ పరిధిలోకి మార్చి తాము ఇళ్ల నిర్మాణాలు చేపట్టుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ స్పందిస్తూ, ఈ అంశం గతంలో డిఎఫ్ఒ దృష్టికి తీసుకువెళ్ళామని, ప్రస్తుతం సీతంపేటలో వున్న అటవీ గ్రామాలను రెవెన్యూ, ఫారెస్ట్ సిబ్బంది సర్వే చేస్తుందని, తరువాత భామిని మండలంలో 16 అటవీ గ్రామాలను సర్వేను దశలు వారీగా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటకొండ గ్రామస్థులు పి లక్కయి, పి. మహేష్, పి. నగేష్ వున్నారు.


వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్


బ్రోచర్లను అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బందలుప్పిలో గడపగడపకు..

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని బందలుప్పిలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో సర్పంచ్ ఏళ్ల ప్రమీలతో కలసి గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బలగ రేవతి, ఎంపిపి మజ్జి శోభారాణి, నాయకులు ఏళ్ళ ప్రతాప్, భీమవరపు కృష్ణమూర్తి, మడక విశ్వనాథం, బంకపల్లి రామకృష్ణ, మువ్వల సత్యము నాయుడు, బొమ్మి రమేష్, మజ్జి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురంలో క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

యువతలో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో క్రికెట్ క్రీడలు ప్రారంభించినట్లు గుమ్మలక్ష్మీపురం సర్పంచి బొత్తాడా గౌరీశంకరరావు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం కొండవీధిలో సోమవారం క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో యువత కాలాన్ని వృథా చేయకుండా ఉండేందుకు పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రికెట్ ద్వారా యువత స్నేహభావంతో పాటు క్రీడా స్ఫూర్తి పెంపొందించాలని కోరారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలు నుంచి 50 పైగా జట్లు పాల్గొంటున్నాయని ఆయన తెలిపారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో పనులు జరుగుతున్న తరగతి గదులకు వెళ్లి పరిశీలించి వచ్చే విద్యా సంవత్సరానికి పనులేవి పెండింగ్ లేకుండా త్వరగతిగా నాణ్యత లోపాలు లేకుండా పూర్తి చేసేలా బాధ్యతలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం. హరికృష్ణను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్. రమేష్ కుమార్, ఆర్‌ఐపిఎల్‌వి ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక హద్దులు నిర్ధారించాకే బంకు స్థలం కేటాయించాలి

మండల కేంద్రంలో గల మంతినివలస సమీపానున్న శ్మశాన వాటికకు హద్దులు నిర్ధారించాకే ఐటిడిఎ ద్వారా మంజూరైన పెట్రోల్ బంకకు స్థలం ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ నూరల్ కమర్‌కు గ్రామస్తులు విన్నవించారు. సోమవారం ఆయన పెట్రోలు బంకు స్థలపరిశీలనకు కురుపాం విచ్చేశారు. ఈ సందర్భంగ ఆగ్రామస్తుల విన్నపం మేరకు శ్మశాన వాటికను సందర్శించి రెవెన్యూ సిబ్బందికి శ్మశాన వాటిక హద్దులను నిర్ధారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఎంపిపి శెట్టి పద్మావతి, సర్పంచ్ సుజాత, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, ఆర్‌ఐపిఎల్‌వి ప్రసాద్, మాజీ వైస్ ఎంపిపి కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

జ్వర లక్షణాలున్న వారిని గుర్తించండి

డిఐఒ జగన్మోహనరావు

ప్రజాశక్తి- కొమరాడ

జ్వర లక్షణాలున్న వారిని గుర్తించి తగు చికిత్స అందజేయాలని వైద్య సిబ్బందికి జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం కళ్ళికోట, గుణానుపురం, విక్రంపురం గ్రామాలను సందర్శించారు. హెల్త్ వెల్నెస్ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులు, మందులు, పరీక్షా పరికరాలు పరిశీలించి వాటి వినియోగం పై ఆరా తీశారు. గ్రామంలో ఎవరైనా జ్వర లక్షణాలతో ఉన్నారా అని సిబ్బందిని అడిగి వారు సూచించిన వారి గృహ సందర్శన చేసి ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. గ్రామాల్లో జ్వర లక్షణాలున్న వారిని గుర్తించి వెంటనే తగు వైద్యం అందజేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఇందులో సూపర్ వైజర్ జయగౌడ్, ఎమ్ఎల్‌హెచ్‌పి (సిహెచ్ఒ)లు అనూష, నరేంద్ర, వర్షిణి, ఎఎన్ఎమ్‌లు లక్ష్మి, శ్రావణి, అశా కార్యకర్తలు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఐఒ జగన్మోహనరావు

నేరాలు ఘోరాలు

భార్య మందలించిందని భర్త ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

వీరఘట్టం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన గొల్ల పున్నయ్య మద్యానికి పూర్తిగా బానిసయ్యాడు. ఇతని ఆగడాలను భరించలేక భార్య సోమవారం ఉదయం తీవ్రంగా మందలించడంతో, మనస్థాపం చెందిన అతను ఇంట్లో మరుగుదొడ్లు కడగడానికి ఉపయోగించే ద్రవాన్ని తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. స్పందించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

భార్య ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్ : భర్త మందలించాడనే మనస్థాపంతో భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుమ్మలక్ష్మీపురం మండలం కోసగూడలో చోటుచేసుకుంది. సోమవారం జిల్లా ఆసుపత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అదే గ్రామానికి చెందిన బిడ్డిక దారుక్షి ఇంట్లో వంట సరిగా చేయడం లేదని భర్త తిట్టడంతో మనస్థాపం చెందింది. దీంతో చేతికున్న గాజులు పగలగొట్టి నీటిలో కలుపుకుని తాగింది. ఆమె అస్వస్థతకు గురవ్వడంతో ఆసుపత్రికి తరలించారు. వైద్యుల చికిత్స అందించగా, అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పార్వతీపురంరూరల్ : పార్వతీపురం పట్టణం పాలకొండ రోడ్డు దీప్తి లాడ్జి సమీపంలో అదే వీధికి చెందిన వంగపండు అప్పయ్యమ్మ 77 ఆదివారం రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో గాయపడింది. కుటుంబీకులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తుండగా సోమవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.